క్లుప్తంగా

ఘనంగా బోనాల జాతర



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కామవరంలో ఆదివారం ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న దుర్గమ్మ, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజుల ఆలయం వద్ద ఈ జాతరను గిరిజనులు నిర్వహించారు. నాగేంద్రస్వామి ఆలయం నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని కామవరం గ్రామంలోని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బోనాలను గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్దకు చేర్చి సమర్పించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో కామవరం గ్రామంలో బోనాల జాతరను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ గురువు వర్షా పుల్లారావు తెలిపారు.

72 మందికి వైద్యసేవలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రతిభ స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆవిష్ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ప్రత్యేకంగా వెరికోస్ వెయిన్స్ (ఉబ్బిన సిరలు)పై పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ శిబిరంలో 72 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు మానవత సంస్థ మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రతిభ స్కూల్ కరస్పాండెంట్ కాసర సత్యనారాయణ ప్రారంభించగా, మానవత సభ్యులు సేవలు అందించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్రావు

టి.నరసాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 9 మంది విద్యార్థులను, తల్లిదండ్రులను పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి సైంటిస్ట్ జి.సురేష్‌బాబు ప్రథమ స్థానంలో నిలిచిన టి.జగన్నాథంను గోల్డ్ మెడల్‌తో సన్మానించారు. 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దొమ్మేటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డీఎస్‌బీ శంకరరావు రూ.12 వేల నగదు మొమెంటోలతో సన్మానించారు. గ్రామ పెద్ద జి.శ్రీరామమూర్తి నగదు అందజేశారు.

ఇంద్రధనుస్సు కనువిందు



కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో ఆదివారం ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం వర్షం కాస్త తెరిపి ఇవ్వడం.. ఆ సమయంలో ఏర్పడిన ఇంద్రధనుస్సును చూసి పట్టణ ప్రజలు సంబరపడ్డారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



చేతి వృత్తిదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కొయ్యలగూడెం: తుపాను నేపథ్యంలో చేతి పనులు లేక ఇబ్బందులు పడుతున్న శ్రామిక వర్గాల వారికి ఆదివారం నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీలక్ష్మీ గణపతి మహేంద్ర కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేదర కులస్తులతో పాటు మరికొన్ని వర్గాల వారికి ఐదు కేజీల బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకులను అందజేశారు. ఏఎస్సై శోభనాద్రి, గౌరవ అధ్యక్షుడు పాతకోట మహేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు అంకోలు క్రాంతి కుమార్, కార్యదర్శి జోరిగే రామ్మోహన్, కోశాధికారి చందా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద తీవ్రతతో కలవరం..

- పెరుగుతున్న గోదావరి వరద
- కొట్టుకుపోతున్న కల్వర్టులు
- స్తంభించిన జనజీవనం.. పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పొలాలు



పోలవరం రూరల్: పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి కలుస్తున్న కొవ్వాడ అధిక జలాలు

కుక్కునూరు: పెరుగుతున్న గోదావరి వరద విలీన మండలాల ప్రజలను కలవరపెడుతోంది. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద 43 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. గోదావరి ఉప నదులైన కిన్నెరసాని, తాలిపేరు నదులకు వరదనీరు పోటెత్తుతుండడంతో తాలిపేరు నుంచి 59 వేల క్యూసెక్కులు, కిన్నెరసాని నది నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అంతేకాక తెలంగాణాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని గొమ్ముగూడెం గ్రామస్తులను పోలీసులు, రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రతి ఏడాది లాగానే లచ్చిగూడెం గ్రామస్తులు కొండపైకి వెళ్లారు. మరోపక్క పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు శబరి నదికి వరద ప్రవాహం పెరుగుతోంది. శబరి ప్రవాహం గోదావరి ప్రవాహాన్ని నిలువరించడంతో విలీన మండలాల్లో ముంపు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని నిర్వాసిత మండలాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో గత ఐదురోజులుగా వదలని వానతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. కూలి చేసుకుని జీవనం సాగించేవారు సైతం ఇళ్లకే పరిమితమయ్యారు. భారీగా కురుస్తున్న వర్షాల వల్ల పలు రహదారుల కల్వర్టులు కొట్టుకుపోవడంతో కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే తిరుగుతున్నాయి. ఫోర్‌వీలర్స్ వాహనాలు తిరిగే పరిస్థితులు లేవు. రెడ్డిగణపవరం సమీపంలో కల్వర్టు కొట్టుకుపోవడం వల్ల బుట్టాయగూడెం నుంచి జీలుగుమిల్లి వెళ్లే వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసులు కూడా అక్కడ నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తిరగకుండా అడ్డుకుంటున్నారు. అదేవిధంగా గుబ్బల మంగమ్మ అమ్మవారి దర్శనాన్ని నిలిపివేశారు. ఆదివారం పలువురు భక్తులు దర్శనానికి వచ్చినప్పటికీ పోలీసులు, ఆలయ కమిటీవారు వారిని తిరిగి వెనక్కి పంపించారు. అలాగే దొరమామిడి సమీపంలో ఉన్న చెరువుకు గండిపడింది. తహసీల్దార్ వెంకటేశ్వర్లుతోపాటు గ్రామ పెద్దలు కాకర్ల చంద్రశేఖర్, సర్పంచ్ తెల్లం రాముడు, తదితరులు గండిపడిన ప్రాంతాన్ని సందర్శించి వాటికి మరమ్మతు పనులు చేపట్టే ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి. నీట మునిగిన పొలాలను ఏఓ బి. ముత్యాలరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

నిండుకుండల్లా చెరువులు

పోలవరం రూరల్: గత నాలుగు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. సాగునీటి చెరువులు నిండుకుండల్లా మారాయి. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కుల నీరు ఒక గేటు ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కొవ్వాడ కాలువ నీరంతా పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది. ఇంకా పొలాలు ముంపులోనే ఉన్నాయి. వర్షాలు పూర్తిగా తగ్గితే తప్ప పొలాలు ముంపు నుంచి బయటకు పడే పరిస్థితి లేదు.



బుట్టాయగూడెం: దొరమామిడి సమీపంలోని చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్, గ్రామ పెద్దలు



పోలవరం రూరల్: పట్టిసీమ వద్ద కొవ్వాడ కాలువలో గట్లను ఆనుకుని ప్రవహిస్తున్న నీరు



కుక్కునూరు: గొమ్ముగూడెం గ్రామం వద్ద నిండుకుండలా మారిన గోదావరి

వరద సహాయక చర్యలు ముమ్మరం

కుక్కునూరు: గోదావరి వరదల నేపథ్యంలో అధికారులు వరద సహాయక చర్యలు ముమ్మరం చేశారు. మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలోని 250 కుటుంబాలను, లచ్చిగూడెం గ్రామంలో 47 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద ఉధృతి తగ్గే వరకు వారికి మూడు రోజులకు సరిపడా బియ్యం, కందిపప్పు, మంచినూనె, వాటర్ ప్యాకెట్లు అందించేందు సిద్ధం చేశారు. అంతేకాక దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రం వద్ద 5 బోర్లు పంపింగ్ చేయించారు. 13 తాత్కాలిక మరుగుదొడ్లను పునరావాస కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. వరద తీవ్రత, తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ వెట్రిసెల్వి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు అధికారులు చెప్పారు.



వరద సహాయక చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవాగు ముంపు బాధితులను ఆదుకోండి

జంగారెడ్డిగూడెం: వరద బాధితులను తక్షణం ఆదుకోవాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. పెదవాగు ప్రాజెక్టు గండి పడడం వల్ల మునిగిపోయిన గ్రామాల్లో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, న్యాయవాదులు యు.ఏసుబాబు, మేకల రామ్మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన డివిజన్ కేంద్రం జంగారెడ్డిగూడెంతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయిగూడెం మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ముఖ్యంగా వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో పెదవాగు ప్రాజెక్టు గట్టు తెగిపోవడం వల్ల వేలేరుపాడు మండలాల్లోని 11 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, కొన్ని ఇళ్లు, పశువులు కొట్టుకుపోయాయని అన్నారు. ఆరు గ్రామాల ప్రజలు కట్టు బట్టలతో మిగిలారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటన చేస్తున్నారు తప్ప నష్టపరిహారం అందించడం లేదని అన్నారు. 400 కుటుంబాలు ఉన్న కమ్మరగూడెం గ్రామానికి వెళ్లే రహదారి లేక, అక్కడ ప్రభుత్వ సహాయం అందడం లేదని, యుద్ధప్రాతిపదికన వారి రహదారి ఏర్పాటు చేసి సహాయం అందించాలని కోరారు. బాధిత ప్రజలకు నూతనంగా ఇళ్లు నిర్మాణం చేపట్టాలని, ఇసుక మేటలు వేసి దెబ్బతిన్న భూములను ప్రొక్లెయిన్ పెట్టించి ఇసుక తొలగించే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని కోరారు. అదేవిధంగా పెదవాగు ప్రాజెక్టు తెలంగాణలో ఉండడం వల్ల తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి ఆ ప్రాజెక్టు గండి పూడ్చి మరమ్మతులు చేపట్టాలని, ఆ ప్రాంతంలో వేలాది ఎకరాల సాగును కాపాడాలని కోరారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో పండిస్తున్న పత్తి, మిరప తదితర పంటలు తీవ్రంగా నష్టపోయారని, వారికి అవసరమైన విత్తనాలు పురుగుల మందులు, ఎరువులు తక్షణం పూర్తి సబ్సిడీపై ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో కొట్టుకుపోయిన కల్వర్టును యుద్ధప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని, పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎస్‌కే గౌస్ సహకరించి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ

తాగునీటి అవసరాలకు ప్రత్యేక ఏర్పాట్లు

వేలేరుపాడు: భారీ వర్షాలు, వరదల కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటి అవసరాలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల ఫ్లాష్ ఫ్లడ్ ప్రభావితమైన 12 గ్రామాల్లో గత మూడు రోజులుగా 2 లక్షల వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశామని అలాగే 8 ట్యాంకుల ద్వారా రోజుకు 18 ట్రిప్పులు నీరు సరఫరా చేశామని చెప్పారు. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని మరో 14 నివాసిత ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయడంతోపాటు వేలేరుపాడు శివకాశీపురంలోని ఎస్టీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 50 వేలు వాటర్ ప్యాకెట్లతోపాటు ఇతర నిత్యావసర వస్తువులు సిద్ధం చేశామన్నారు. కుక్కునూరు మండలం దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ పునరావాస కేంద్రంలో ఇప్పటికే 5 బోర్లు పంపింగ్ చేశామని ఒక మోటారును కూడా ఏర్పాటు చేశామని, ఇక్కడ పునరావాస కేంద్రంలో 13 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

శాకంబరిగా శ్రీచింతాలమ్మ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణతో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీనూకాలమ్మ దేవస్థానంలో చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త తిప్పాభట్ల రామకృష్ణ మాస్టర్ చండీహోమం విశిష్టత వివరించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణతో శ్రీచింతాలమ్మ అమ్మవారు

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇటీవల జంగారెడ్డిగూడెంలోని తన నాయినమ్మ ఇంటికి వచ్చింది. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు

వేలేరుపాడు: వరద ముంపు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట తెలిపారు. వేలేరుపాడు మండలం దాచారంలో ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. వరద బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ పునరావాస కేంద్రంలో వైద్యసేవల నిమిత్తం రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కుక్కునూరులో ఎ బ్లాక్‌లో ఒక వైద్య శిబిరం, వేలేరుపాడు పీహెచ్‌సీ సమీపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు, ఈ శిబిరాలకు 28 మంది వైద్యాధికారులను, సిబ్బందిని నియమించామన్నారు. 16 మందిని డిప్యూటేషన్‌పై వైద్య సేవల కోసం వినియోగిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాల్లో 8 మంది ప్రత్యేక డాక్టర్లను నియమించడం జరిగిందని, వీరితో పాటు ఏఎన్ఎంలను, ఆశా వర్కర్లను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. అత్యవసర మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వేలేరుపాడు మండలంకు చెందిన 9 మాసాలు నిండిన ఎం.సీత గర్భిణీని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, అదే విధంగా కుక్కునూరులోని ఇద్దరు బాలింతలను కూడా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని డీఎంహెచ్ఓ చెప్పారు.

ముంపు గ్రామాల్లో ప్రజలను కాపాడండి

జంగారెడ్డిగూడెం: అల్పపీడనం, పెదవాగు ప్రాజెక్టు ముంపుతో ప్రభావితమైన ప్రాంతాల్లో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు ఆదివారం పర్యటించారు. పర్యటన అనంతరం జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి అనేక గ్రామాలు నీట మునిగాయన్నారు. సరైన నిర్వహణ లేకపోవడం వల్లే పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిందని, దీంతో 15 గ్రామాలు తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కోవడం జరిగిందన్నారు. ప్రాజెక్టు రెండు రాష్ట్రాలకు చెందినప్పటికీ 85శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, దాని నిర్వహణ బాధ్యత కూడా ఆంధ్రప్రదేశ్‌దే అన్నారు. ఈ రిజర్వాయర్ మొత్తం కెపాసిటీ 0.5 టీఎంసీలని, గండి ప్రభావంతో చుక్క నీరు లేకుండా పోయిందన్నారు. వెంటనే నిరాశ్రయులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వారు కుదుట పడేవరకు నిత్యావసరాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణ సహాయంగా రూ.10 వేలు ఇవ్వాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, జిల్లా సెక్రెటరీ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, తెల్లం రామకృష్ణ, టి.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, వై.నాగేంద్ర, వేలేరుపాడు మండల కార్యదర్శి దర్శుల రమేష్, ఎం.దుర్గారావు, స్థానిక గిరిజన నాయకులు ఉన్నారు.



జంగారెడ్డిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

పట్టెన్నపాలెం జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను పూర్తిచేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి జీవరత్నం మాట్లాడుతూ నిరంతరం పట్టెన్నపాలెం మీదుగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రముఖ క్షేత్రమైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లే ప్రధాన కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వెళుతుంటారన్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పూర్తి ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజల సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్ర, అంధుగుల ప్రభాకరరావు, కరువుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణం పూర్తిచేయాలని పట్టెన్నపాలెం జల్లేరు వాగు వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

పోలవరం రూరల్: గురుపౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కన్నాపురం అడ్డరోడ్డు, పోలవరంలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సాయినామస్మరణ, విష్ణుసహస్ర నామ పారాయణ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సుబ్బంపేట రోడ్డులో వేంచేసియున్న సాయిబాబా ఆలయంతో పాటు, పాత బస్టాండ్, ఉప్పలమెట్ట, ఏలూరు రోడ్డులోని సాయిబాబా స్థూపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొయ్యలగూడెం: గురు పౌర్ణమి సందర్భంగా బయ్యనగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యలగూడెం, కన్నాపురం, రాజవరం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులను భక్తులు సత్కరించారు.





ద్వారకాతిరుమల: సాయిబాబాకు హారతులిస్తున్న పురోహితుడు

పోలవరం రూరల్: విశేషాలంకరణలో షిర్డీ సాయినాథుడు

ద్వారకాతిరుమల: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బాబాకు ఆలయ నిర్వాహకుడు పుప్పాల మురళీ, భక్తుడు చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం తదితరులు ప్రత్యేక అభిషేకాలు, పూజాధికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయం వద్ద విఘ్నేశ్వర భక్త సమాజం సభ్యులు భజనలు చేశారు. అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కుక్కునూరు: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం కుక్కునూరు, రాజీవ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. 101 బిందెలతో సాయిబాబా విగ్రహానికి జలాభిషేకం, పంచామృతాలతో అభిషేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

బాధితులను ఆదుకుంటాం

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని విధా లా చర్యలు తీసుకున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయపూర్ మండలంలోని మేడేపల్లి కమ్మరీగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వరద పరిస్థితిపై గంట గంటకు అధికారులతో సమీక్షిస్తున్నారని తెలిపారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయమై తెలంగాణ మంత్రితో కూడా ముఖ్యమంత్రి మాట్లాడారని చెప్పారు. బాధితులు వరద నీటిలో చిక్కుకున్నారని ప్రభుత్వం హెలికాప్టర్లు పంపి ప్రాణాలను కాపాడిందని అన్నారు. వరద బాధితులకు ఏ లోటు రాకుండా ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. బాధితులకు పునరావాస కేంద్రాల్లో భోజన వసతి కల్పించినట్లు చెప్పారు



వరద బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్

పేకాట స్థావరంపై దాడి

టి.నరసాపురం: పేకాట స్థావరంపై టి.నరసాపురం పోలీసులు దాడులు నిర్వహించారు. బండివారిగూడెంలో ఆదివారం నిర్వహించిన ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపారు.